క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నందిగామ మండలం నర్సప్పగూడకు చెందిన 8 మందికి చెక్కులను అందజేశారు. జంగిలి కుమార్‌కు రూ.36వేలు, బంటారం రాజమణి రూ.28వేలు, మలుగ అంజమ్మకు రూ.26వేలు, కాట్న బాలరాజుకు రూ.23వేలు, జెగ్గ లక్ష్మయ్యకు రూ.26వేలు, నీరటి లక్ష్మమ్మకు రూ.24వేలు, కావలి నరేష్‌కు రూ.16వేలు, తాళ్లపల్లి గోపాల్‌కు రూ.12వేల చెక్కులను అందజేశారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

ఎంపీపీ నక్షత్రం



జనుము విత్తనాలను అందజేస్తున్న నక్షత్రం, శ్రీకాంత్ తదితరులు

మొయినాబాద్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్ అన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే జనుము, జీలగ విత్తనాలను గురువారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, సబ్సిడీ విత్తనాలను అందజేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీలు మల్లేష్, అర్జున్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, నాయకులు ఇంద్రారెడ్డి, నర్సింహ్మారెడ్డి, ఎట్టయ్యగౌడ్ పాల్గొన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

సర్పంచ్ కేతన



యజ్ఞహోమాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

షాబాద్: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని కుమ్మరిగూడ సర్పంచ్ పోనమోని కేతన పేర్కొన్నారు. గురువారం మండలంలోని కుమ్మరిగూడలో నూతనంగా నిర్మించిన బీరప్ప, మల్లన్న దేవాలయంలో మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం యజ్ఞ హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. గ్రామాల్లో ఇంత మంచిగా దేవాలయాలు నిర్మించి పూజలు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అరుణ, గ్రామస్తులు తదితరులున్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలి

జేఎన్‌టీయూ రెక్టార్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గోవర్ధన్



ప్రిన్సిపాల్ రామకృష్ణకు అవార్డును అందజేస్తున్న గోవర్ధన్

మొయినాబాద్ రూరల్ : మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్ విద్యా రంగంలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలని హైదరాబాద్ జేఎన్‌టీయూ రెక్టార్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ గోవర్ధన్ పేర్కొన్నారు. 2023 ఉన్నత విద్యా కోసం మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించి అవార్డును సంపాదించారు. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీ విద్యా సంస్థకు కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రిన్సిపాల్ రామకృష్ణలకు సీఎస్‌ఐ అవార్డును గోవర్ధన్ అందజేశారు. అనంతరం పార్థసారధి వర్మ, ప్రిన్సిపాల్ రామకృష్ణలు మాట్లాడుతూ.. 2023 విద్యా సంవత్సరంలో తమ కేఎల్ యూనివర్సిటీ సీఎస్‌ఐ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

వేసవి దుక్కులతో లాభాలెన్నో!

భూమిలో చీడపీడల నివారణ
- గొర్రెల మంద కట్టడంతో సేంద్రియ ఎరువులు లభ్యం
- గుల్లబారనున్న నేల
- వ్యవసాయ అధికారి వెంకటేశం



తాళ్లపల్లిలో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న రైతులు

షాబాద్: త్వరలో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. రైతులు ఇప్పటి నుంచే పొలం పనులు చేసుకుంటే మంచిది. ముందస్తు ప్రణాళికతో అధిక దిగుబడులు, మంచి లాభాలు పొందే అవకాశముంటుంది. భూసార పరీక్షలు, వేసవి దుక్కులు, చేను చదును, విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల వాడకం, పంటకు అనుగుణంగా భూమిని సిద్ధం చేయడం తదితర పనులను ఒక ప్రణాళికా ప్రకారం చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం వివరించారు.

పశువులు, గొర్రెల మంద కట్టడం...

గతంలో ప్రతి రైతు ఎద్దులు, ఆవులు, గేదెలను రాత్రుళ్లు పొలంలో కట్టేసేవారు. వాటి మలమూత్రాలు పొలానికి చేరి పంటలకు ఉపయోగపడేవి. దీంతో ఎరువులు ఖర్చు తగ్గేది. ఇప్పటికీ పలు గ్రామాల్లో గొర్రెలను రాత్రిళ్లు పొలాల్లో మందలుగా ఏర్పాటు చేస్తారు. దీంతో చేనుకు అవసరమైనంత గొర్రెల ఎరువు, మూత్రం లభ్యమవుతుంది. సేంద్రియ ఎరువు పొలానికి అందడంతో అధిక లాభాలు పొందవచ్చు.

లోతు దుక్కులతో ప్రయోజనాలు..

ఇటీవల మండలంలోని వివిధ ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకోవడానికి సరిపడ తేమ ఉన్న పొలాల్లో ట్రాక్టర్లు లేదా ఎద్దుల నాగళ్లతో లోతుగా దున్నాలి. లోతు 9 అంగుళాలకు తగ్గకుండా ఉండాలి. లోతుగా దున్నడంతో నేలలో ఉండే పురుగులు నశించి చీడపీడల నివారణకు అవకాశం ఉంటుంది. వేసవి కాలంలో పంట కోతలు పూర్తయిన వెంటనే పొలాలను దుక్కి చేసుకుంటే తొలకరిలో విత్తుకునే పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

వేర్లు విస్తరించేందుకు అవకాశం..

వేసవిలో లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి నేల అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటుక, దతెల వంటి పరికరాలు నేల లోపలికి 3–4 అంగుళాల లోతు వరకు చొచ్చుకుపోతాయి. ఈ పరికరాలతో పదే పదే సేద్యం చేయడంతో 3–4 అంగుళాల లోతులో గట్టి పొర ఏర్పడుతోంది. దీంతో నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతోంది.

సేంద్రియ పదార్థం నేలలో కలుస్తుంది..

పంటకోత తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లు పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకుల వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోతాయి. దీంతో నేలలో సేంద్రియ పదార్థాలు, పోషక పదార్థాలు పెరగడానికి అవకాశం ఉంది.

పశువుల ఎరువులను పొలాలకు వేయాలి

సంవత్సరం పొడవునా నిల్వ చేసిన పశువుల ఎరువులను ఎండాకాలంలో పొలాల్లోకి తోలాలి. వర్షాలు పడిన తర్వాత పొలాలకు తోలిన పశువుల ఎరువులను నేలపై చల్లిలోతు దుక్కి దున్నితే మట్టిలో బాగా కలుస్తుంది.. పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి.

అవగాహన కల్పించాలి



గ్రామాల్లో రైతులకు అధికారులు మరింతగా అవగాహన కల్పించాలి. వ్యవసాయ అధికారులు సమావేశాలప్పుడే కాకుండా మిగతా సమయంలో కూడా రైతులను క్షేత్రస్థాయిలో చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. మేకల ఎరువు కూడా దొరకని పరిస్థితి ఉంది.

–సాయిబాబా రైతు, తాళ్లపల్లి

దుక్కులను దున్నుకోవాలి...



వేసవిలో దుక్కులు దున్నుకోవడంతో రైతులకు వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోతుగా దున్నుకునేందుకు కృషి చేయాలి. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

–వెంకటేశం, ఏఓ షాబాద్

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన రైతులు, నాయకులు

చేవెళ్ల: పట్టు పురుగుల పెంపకం రైతుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ రంజిత్‌రెడ్డిని రైతులు కోరారు. గురువారం ఎంపీ రంజిత్‌రెడ్డి నివాసానికి పలువురు రైతులు వెళ్లిన ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టు పురుగుల పెంపకం ద్వారా వచ్చే పట్టుగుళ్ల తిరుమలగిరి, జనగాం మార్కెట్‌లో అమ్మిన నెలల తరబడిగా డబ్బులు రావడం లేదని చెప్పారు. ఈ డబ్బులు త్వరగా ఇప్పించేలా చూడాలని కోరారు. పట్టు పురుగుల రైతులకు తగిన సహాయ సహకారాలు అందించాలని అన్నారు. స్పందించిన ఎంపీ రంజిత్‌రెడ్డి వెంటనే కమిషనర్ హనుమంతరావు, మార్కెట్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు రావాల్సిన డబ్బులు వెంటనే వారి ఖాతాల్లోకి జమ చేయాలనే ఆదేశించారు. మళ్లీ రైతులు సమస్య ఉందని చెప్పకుండా చేసుకోవాలని మార్కెట్ అధికారులకు సూచించారు. రైతుల వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, నాయకులు, రైతులు అనంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎండలోనే ఉపాధి పనులు

- నీడ లేదు, నీళ్లు లేవు
- ఆగ్రహం వ్యక్తం చేసిన సీపీఎం నాయకులు



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

యాచారం: ఎండలోనే ఉపాధి పనులు చేయించడం దారుణమని, వడదెబ్బతో కూలీలు మృత్యువాత పడితే బాధ్యులెవరని సీపీఎం నాయకులు తావునాయక్, చందునాయక్ ప్రశ్నించారు. మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో గురువారం సీపీఎం నాయకులు ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పనులు చేసే చోట నీడ లేదని, తాగేందుకు నీళ్లు లేవని, అత్యవసర సమయాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు గాని, ఇతర మందులు గాని అందుబాటులో ఉండడం లేదని కూలీలు ఫిర్యాదులు చేశారు. కొత్త నిబంధనలతో కూలీ గిట్టుబాటు కావడం లేదని.. చేసిన పనులకు పక్షం రోజులు దాటినా డబ్బులు అందడం లేదని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి పనులు చేసే చోట అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యం కూలీ రూ.500 పడేలా నిబంధనలు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎంపీపీ ఎం.విజయలక్ష్మి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, తదితరులు

చేవెళ్ల: మండలంలోని గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఆలూరులో గురువారం మండల పరిషత్ నిధులు రూ.10లక్షలతో ఎంపీటీసీలు నరేందర్‌చారి, యాదమ్మల ఆధ్వర్యంలో సీసీరోడ్డు, ఎంపీపీ సొంత నిధులు రూ.75వేలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులను అన్ని గ్రామాలకు సమానంగా కేటాయించి అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని వివరించారు. ఆదర్శ మండలముగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ అయిన ఆలూరులో ఉన్న సమస్యలను స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు నరేందర్‌చారి, యాదమ్మలతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు నర్సింలు, అశోక్, పరిగి నర్సింలు, హైమద్, రవి, శ్రీను ఉన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

డీసీసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని డీసీసీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. రెండోసారి డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన నర్సింహ్మారెడ్డిని గురువారం మొయినాబాద్ మండల నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. వచ్చే ఆరు నెలలు చాలా కీలకమైనవని..కర్ణాటక ఫలితాలను తెలంగాణలో తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు మహేందర్‌ముదిరాజ్, మల్లేశ్‌గౌడ్, జంగారెడ్డి, వెంకటరెడ్డి, రమేశ్, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జంగయ్య, రాజుగౌడ్, భిక్షపతి, నరేష్ ఉన్నారు.

అరకొర విత్తనాలతో ఇబ్బందులు

కాంగ్రెస్ నాయకుడు మాణయ్య

మొయినాబాద్: ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలను అరకొరగా సరఫరా చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సబ్సిడీపై జనుము, జీలగ విత్తనాలను ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మొయినాబాద్ మండలానికి కేవలం 130 బస్తాలు మాత్రమే పంపితే ఎవరికి సరిపోతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం పంపిన విత్తనాలు అరగంటలో అయిపోయాయని.. విత్తనాలు దొరక్క రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారని అన్నారు. రైతులందరికీ విత్తనాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నిందితుడికి రిమాండ్

శంకర్‌పల్లి: చోరీ కేసుల్లో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన ప్రణీత్ (27) రోజు వారి కూలి. జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు సిద్ధమయ్యాడు. ఈ నెల 9న ఓ ఇంట్లోకి చొరబడి రూ. 50వేల నగదు ఎత్తుకెళ్లాడు. 17న పట్టణంలో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశాడు. గురువారం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా తానే దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రసన్న కుమార్ తెలిపారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక దాడులు దుర్మార్గం



ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు శ్రీనివాస్

చేవెళ్ల: మహిళ రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషన్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రవల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చేవెళ్లలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఇది మోదీ ప్రభుత్వ విధానాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. ఒక వైపు బీజేపీ ప్రభుత్వం 'బేటి బచావో బేటి పడావో' నినాదాన్ని ఇస్తుంటే అదే బీజేపీ నాయకులు కామాంధుల్లా మహిళా రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎంపీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

'కంటి వెలుగు'తో పేదల జీవితాల్లో వెలుగులు



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన చైర్మన్ నరేందర్

మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కౌన్సిలర్ కానుగు అంతయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు కంటి సమస్యలతో బాధపడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దృష్టి సమస్యలున్నా ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి కళ్లాద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్నా ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి యాదవ్, నందకిషోర్, ఆరోగ్య సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంరెడ్డి



శ్రీనివాసాచారిని సన్మానిస్తున్న రాంరెడ్డి

మొయినాబాద్ రూరల్ : నిజాయితీగా పనిచేస్తే గుర్తింపు, ప్రమోషన్లు వాటంతట అవే వస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పీసీసీ కార్యవర్గ సభ్యులు మాడి రాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అజీజ్‌నగర్‌లో గల సాయిబాబా దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యులైన శ్రీనివాసాచారిని ఘనంగా సన్మానించారు. శ్రీనివాసా చారికి లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా సెక్రటరీ జనరల్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబా దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యులతో పాటు గ్రామస్తులు ఆయనను సన్మానించారు. జాతీయ స్థాయిలో శ్రీనివాసాచారి ఆలిండియా సెక్రటరీగా ఎంపిక కావడం ఆదర్శనీయమని రాంరెడ్డి తెలిపారు. గతంలో జాతీయ అధ్యక్షుడిగా మూడుసార్లు పని చేశారని గుర్తు చేశారు. ఆయనను సన్మానించిన వారిలో శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి, సత్తయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

వంట పాత్రల బహూకరణ



వంట పాత్రలను బహూకరిస్తున్న నర్సింలు

కొందుర్గు: మండలంలోని మహదేవ్‌పూర్‌కు చెందిన బాగ్లి నర్సింలు తన తండ్రి జ్ఞాపకార్థం గురువారం వంట పాత్రలు బహూకరించారు. ఈ సందర్భంగా నాలుగు డేగులు, బకెట్లు, స్పూన్‌లు అందజేశారు. అలాగే, గ్రామంలోని వృద్ధులు విశ్రాంతి తీసుకొనేందుకు నాలుగు సిమెంట్ బెంచీలు అందజేశారు. కార్యక్రమానికి ఎంపీడీఓ ఆంజనేయులు హాజరై నర్సింలును అభినందించారు. నర్సింలను అందరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి బాబయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే



చేవెళ్ల: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న వీరేందర్‌రెడ్డి, ఇతర నాయకులు

షాద్‌నగర్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సీఎం కప్ పేరుతో ఆటల పోటీలను నిర్వహిస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్‌లో నిర్వహించిన మండలస్థాయి సీఎం కప్ ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆటల పోటీలను నిర్వహిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసిందన్నారు. క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మానిక, పద్మ, నరేందర్‌రెడ్డి, రామకృష్ణ, కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్ రాథోడ్ పాల్గొన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు

చేవెళ్ల: గ్రామీణ యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎ. వీరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంతారంలో యువజన కాంగ్రెస్ నాయకుడు కావలి వెంకటేష్‌బాబు సహకారంతో కేవీబీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రామ స్థాయి నుంచి వారిలోని క్రీడాప్రతిభను వెలికితీయాలన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకుంటూ ముందుకు వెళ్లాలని చెప్పారు. ఈ పోటీలను నిర్వహిస్తున్న వెంకటేశ్‌బాబును ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో గెలుపొందిన విజేత జట్టుకు రూ.20వేల నగదు, రెండవ బహుమతిగా రూ.10వేల నగదు షీల్డ్‌లను అందజేయనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. మొదటిరోజు ప్రారంభించిన పోటీల్లో అంతారం, కౌకుంట్ల జట్లు పోటీ పడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు సుధాకర్, నరేందర్, సుధాకర్, కుమార్, సత్యనారాయణ, పాషా, గణపురం తరుణ్, నగేశ్, రవి, కిసక్షర్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అనంతయ్య పాల్గొన్నారు.

యువత క్రీడాల్లో రాణించాలి

కేశంపేట: యువత క్రీడాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో బుధవారం మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్ పాల్గొన్ని క్రికెట్ పోటీలను స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. యువత క్రీడాల్లో రాణించి గ్రామాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని పాటిగడ్డలో బుధవారం పోచమ్మ దేవాలయ నిర్మాణానికి సర్పంచ్, కమిటీలతో కలిసి ఎంపీపీ రవీందర్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, నవీన్‌కుమార్, కృష్ణయ్య, జగన్‌నాయక్, మల్లేష్ యాదవ్, లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.



కేశంపేట: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న, రవీందర్ యాదవ్